# వెన్నెలలో మానవుడు

రైలుబండి అంతా క్రిక్కిరిసి వుంది. బండీ పరుగెడుతూన్నా బండీలో కూర్చున్న రామారావుకు గాలి ఏమాత్రమూ ఆడటంలేదు దీనికితోడు చుట్టూ కూర్చుని వున్న జనము రైలుపెట్టెను ఉమ్ములతోను, వారింజతొక్కలతోను, చుట్టలపొగతోనూ నానాగలీజు చేసివేస్తున్నారు ఇంత గందరగోళంలోనూ, భరింపరాని వేడిలోనూ, చెమటలోనూ, కొందరు జనం స్థలంకోసం దొమ్మీ చేస్తున్నారు, కొందరు గుర్రుపెట్టి ప్రక్కవాళ్ళ భుజాలమీద వాలి నిద్రపోతున్నారు సెనగపప్పు, మామిడిపళ్ళు, తాటిముంజెలు, జీడిపప్పు, పిప్పరమెంట్లు అమ్మకునేవాళ్లు, ప్రయాణికులను తోసుకుంటూ, అరుచుకుంటూ అమ్మకం సాగించుకుపోతూనే వున్నారు.

రైలు కుదుపుకుదిపి కూతకూసి ఏలూరు వైపు బయలుదేరినతర్వాత పెట్టెలోని తన చుట్టూవున్న ప్రయాణికులనందరినీ పరికీలనగాచూచి రామారావు నిట్టూర్చేడు తోటిప్రయాణికులమీద చెప్పరానిఅసహ్యం కల్గింది అతనికి ఏమిటిది? వీళ్ళంతా మానవులేనా? ఎందుకు యిట్లా ప్రవర్తిస్తారు వీళ్లు? పశువుల్లా ఏమిటీ హడావడి, గందరగోళం, గలీజు ! వెంటనే రామారావుకు మరో ఆలోచన కల్గింది తనలాగే ఆదుర్దాగా రైలెక్కినవాళ్లే తప్పేమివుంది యిందులో! రైల్లో స్థలంవుంటే, వాళ్లిట్లా ప్రవర్తించకపోదురేమో? వెంటనే చుట్టూరా నిలబడి వున్న ప్రయాణికులపైన చెప్పరాని జాలి కల్గింది అతనికి.

ముస్తాబాదు స్టేషనులో బండి ఆగింది రామారావు ఆలోచనలు ఒక్కక్షణం ఆగిపోయేయి తూలుకుంటూ తమపెట్టెలోకి ఎక్కుతూన్న ఆజానుబాహువుమీద అతని దృష్టి వాలింది మనిషి అంత ఒడ్డూ, పొడుగూ వున్నా ఏదో నిస్సహాయుడులా అవుపించసాగేడతను పెదిమల చివర ఏవో విషాదరేఖలు! ఆ వ్యక్తి తూలుకుంటూ రామారావు కూర్చున్నచోటుకువచ్చి సామానులుపెట్టే బల్లను పట్టుకుని నిలబడ్డాడు. గుప్పుమని ముక్కులు పగిలేట్లు సారావాసన పెట్టెఅంతా వ్యాపించింది రామారావు అతన్ని అసహ్యంతో చూచి, వక్కక్షణం ముఖం ప్రక్కకుత్రిప్పుకున్నాడు—తనీవేళ ఎందుకు బయలుదేరేనా అని తనని తానే తిట్టుకుంటూ.

కాని బయలుదేరక చేసేదేముంది ! మరొక్క అయిదు నిమిషాలు ఆలస్యం అయివుంటే మరేమయ్యేదో ! ఒంటిగంట అవొస్తోంది. బల్ల సర్దుకుని, కాఫీకి యింటికి వెళ్ళబోతూండగా పోస్టుమేన్ కార్డు ముక్కను ఆఫీసు బల్లపైకి విసిరేడు.

ఉత్తరం తీసుకుని తను మెట్లుదిగి క్రిందకి వచ్చి, సిగరెట్ వెలించుకుని, వుత్తరాన్ని చదివేడు 'బాబుకు ఏలూరు హాస్పిటలులో ఆపరేషను చేసేరనీ, పరిస్థితి ఆందోళనకరంగా వుంది గనుక, నువ్వు వెంటనే బయలుదేరి రావాలని' జాబు

క్రింద సంతకమైనా లేదు. వంకరటింకర అక్షరాలు బహుశా తనచెల్లెలేరాసి సంతకం మర్చిపోయి వుండవచ్చును.

## • "శాపం"

కార్డును జేబులోపెట్టుకుని ఇంటికి హడావడిగా పరుగెత్తేడు తను బండీకి సరిగ్గా ఇంకా గంటమాత్రమే 'టైం'వుంది. భార్యకి వుత్తరంచూపేడు తను ఆమె మరీ బేజారయిపోయింది. గబగబా కాఫీ యిచ్చి, "వెళ్ళి రండి-పాపం, వాళ్ళక్కడ యేం ఖంగారు పడుతున్నారో" అని తననింతొందరచేసింది. బియ్యానికని దాచిన 12 రూపాయలు జేబులో వేసుకుని హడావడిగా తనొచ్చి ఈ రైలులో పడ్డాడు. మెయిలులో అయితే ఇంత అవస్థ వుండకపోవచ్చునేమో, కాని 'టైం' ఏదీ? ఆకారు చూసేక మొట్టమొదటి ఈ రైలుకి బయలుదేరక చేసేదేముంది?

పెట్టెలో నిలబడివున్న ఆజానుబాహువు, నవ్వుతూ గొణుగుతూనే ఆకస్మికంగా పక్కమనిషిమీదికి వొరిగి, పెట్టెలో పడిపోయేడు. రామారావు ఆ మనిషి పడటం గమనించినా కదలలేకపోయేడు పట్టుకోడానికి. ఎదురుంగా వున్న గ్యాంగ్‌మనిషి ఒకతను పడిపోతున్న మనిషిని మధ్యలోనే పట్టుకుని, తొడమీద కూర్చోపెట్టుకుని 'మంచినీళ్ళ'ని అరిచేడు.

ఎవరివద్దవుంటాయి మంచినీళ్ళు, అనుకున్నాడు, రామారావు కొంచెం చికాకుపడుతూ, ముడుచుకు కూర్చుని. పెట్టెలో వున్న వృద్ధురాలు ఒకామె కోడలితో అంది "మన మరచెంబులో ఏమైనా వున్నాయేమో చూడమ్మా...మరం కావలిస్తే మళ్ళీ వచ్చే స్టేషన్లో పట్టుకోవచ్చు"

కోడలు లేచి మరచెంబు మూతతీసి, మరచెంబును 'గ్యాంగ్ మేన్'కు అందిచ్చింది. అతను గ్లాసులో కావలిని నీళ్ళు పోసి, ఆ నీళ్ళు పడిపోయిన వ్యక్తి ముఖంమీద చిలకరించేడు. రెండు నిమిషాలకు ఆవ్యక్తి కదిలి, కళ్ళు తెరచి, కృతజ్ఞతతో 'గేంగ్‌మాన్' వైపు తిరిగిచూచేడు. లేచి కూర్చున్నాడు. మాట్లాడకుండానే ఓ గ్లాసుడునీళ్ళు త్రాగి లేచి నిలబడ్డాడు. ఎందుకో రామారావు ఇస్త్రీబట్టలవైపు, షేక్స్ 'షూ' వైపు ఓసారి తీక్షణంగా చూచి ముఖం త్రిప్పుకున్నాడు. ప్రక్కస్టేషన్లో బండి ఆగగానే త్వరితంగా దిగి వెళ్ళిపోయేడు.

బండీ తిరిగి కదిలింది. బండీలోని జనం యథాప్రకారం మాట్లాడుకోవడం,వుమ్మడం, గొణగడం, నిద్రపోవడము సాగించేరు.

రామారావు ఆలోచనలో పడ్డాడు. తనకి చాలా గొప్ప గొప్ప ఆలోచనలున్నాయి. మానవత్వంతో తిరిగి ఈ ప్రపంచాన్ని పునర్నిర్మించవచ్చుని తను గట్టిగా నమ్ముతాడు. కాని ఈ అజ్ఞానంలోపడిన మానవుల్ని తను ప్రేమించలేకపోయేడు. పడిపోతున్న ఆ త్రాగుబోతును లేచి పట్టుకోలేకపోయేడు. పోనీ పడిపోయేకనైనా - కొద్దిగా కూడా సాయంచెయ్యలేకపోయేడు ఏమీచదువుకోని పల్లెటూరి వృద్ధురాలు చూపిన మానవత్వాన్ని కూడా తను చూపలేకపోయేడు. ఎందుకు? సిగ్గా? బట్టలు మాసిపోతాయని భయమా? నలుగురూ తనవంకే చూస్తారనా? ఓయి భగవాన్ ఏమిటీ ప్రశ్నలు. తను ప్రజల్ని ప్రేమించగలడు కాని త్రాగుబోతులు, కుష్ఠువాళ్ళు, మురికివాళ్లు — వీళ్ళా ప్రజలంటే? మరెవ్వరు? ఎవర్ని ప్రేమించేది నువ్వు?

రామారావు భరించలేక, ఆలోచనల్ని తోసేసి కిటికీలోనుంచి బయటకు చూడసాగేడు.

ఏలూరులో బండీ ఆగింది. రామారావు లేచి బండీ దిగుతూండగా పెట్టెలోని వాళ్ళంతా నిందాపూర్వకంగా తనవేపే ప్రేలొత్తి చూపి నవ్వుతూన్నట్లనిపించింది. తనుచూచే ఏదో గుసగుసలాడుకుంటున్నట్లు అన్పించింది వాళ్ళ చూపులు తన శరీరాన్ని దహించివేస్తున్నట్లు అయిపోగా, త్వరితంగా బయటపడి, రిక్షా ఎక్కి

## వెన్నెలలో [illegible]

గోపాలంగారి హాస్పటలుకు వెళ్లేడు రామారావు. దడదడలాడే గుండెలతో హాస్పటలు ఆవరణలో అతను కాలుపెట్టేసరికి అయిదుం పావయ్యింది.

కుడివైపున హాలువరె వుంది. హాలుముందు పదెనిమిది కుర్చీలున్నాయి. ఎవరో ఒక రిద్దరు కూర్చునివున్నారు వాటిలో-బహుశా ఘుంఘులక్కోసం ఎదురుచూస్తూ. హాలు ప్రక్కనే 'ఆస్టిన్' కారు ఒకటి నిలబడి వుంది. ఆ కారుముందు వంగి కూర్చుని ఒక వ్యక్తి ఏదో పరిశీలనగా చూస్తూవున్నాడు. రామారావు ఆత్రుతతో కుడివైపున ఎడంగా వున్న గదులవైపు చూచేడు ఎవరో ముగ్గురు స్త్రీలు అటుయిటూ హడావడిగా తిరుగుతూన్నారు. రోగులవార్డు కాబోలును అది. అయితే ఆ చుట్టుప్రక్కల తన చెల్లెలుగాని, తల్లిగాని, తమ్ముడుగాని ఎక్కడా అవుపించ లేమిటి? గదుల్లలోపలకు దృష్టి సారిస్తూ యీమూలనుండి ఆమూలకు నడిచేడు, రామారావు తన బావగాని, ఆఖరికి తనకి పరిచయస్థులుగాని ఎవ్వరూ కన్పించలేదు. బహుశా యీసరికి అంతా అయిపోయి వుంటుందా! తనవాళ్లంతా యింటికిపోయి ఏడుస్తూ కూర్చున్నారా? ఇంత నీచాలోచన వచ్చినందుకు తనను తాను నిందించుకుని, మరోసారి లోపలకు దృష్టిని పారించి వరండాలో వడవడా గేడు రామారావు. బహుశా తన బావకు స్వస్థత చిక్కడంవలన యింటికి వెళ్లిపోవచ్చునన్నారేమో? తను తిన్నగా ముందు యింటికి వెళ్లివుండవలసిందేమో!.. కాని వాళ్లు వుత్తరంలో తన నిక్కడకే రమ్మని రాసేరే!

రామారావుకు ఏమిచెయ్యాలో తోచింది కాదు. ఇంకా ఎక్కడైనా గదులున్నాయేమోనని చుట్టూ చూచేడతను. ఎడమవైపున మేడమీద చిన్నహాలువుంది బహుశా అది 'ఆపరేషను థియేటరు' అయివుండాలి. అయినా డాక్టరుగార్నే తను స్వయంగా ఒకసారి కలుసుకుంటే? రామారావు హాలులోనికి వచ్చి ఆ గంతకులలోని వక వృద్ధుని అడిగేడు, "డాక్టరుగారు వున్నారా?" అని.

'ఆస్తమా' రోగిలావున్న ఆ వృద్ధుడు, దగ్గి, "వారే డాక్టరుగారు" అని, యింకా కారును పరిశీలిస్తున్న వ్యక్తిని చూపేడు

రామారావు కారు వద్దకువచ్చి ఆగేడు. డాక్టరులేచి, చేతులు దులుపుకుంటూ "ఇప్పుడే వస్తాను" అంటూ హాలువెనక వున్న గదిలోపలకు వెళ్లి, రెండు క్షణాలలో తడి చేతులు తుడుచుకుంటూ తిరిగివచ్చి, "లోపలకురండి" అన్నాడు డాక్టరు వెనకే రామారావు "కన్సల్టింగ్ రూం"లోకి దారితీసేడు.

ఖాళీగా వున్న కుర్చీలో కూర్చుని, రామారావు అన్నాడు "క్షమించండి, చిన్న "యిన్ఫర్మేషన్" కావలసి వచ్చేను"

"ఓ, ఏసీ" అన్నాడు, డాకరు.

"మాబావకు ఆపరేషను చేసేరని వుత్తరం వచ్చింది అందులో గోపాలంగారి హాస్పిటలు అనికూడా వ్రాసేరు. కాని వార్డంతా రెండుసార్లు వెతికినా మాబావ జాడ కన్పించలేదు అతను ఎక్కడున్నాడో దయచేసి చెబుతారా"

"ఏం ఆపరేషను అది?"

"తెలియదు, వాకొచ్చిన వుత్తరంలో వివరాలేమీ లేవు."

"ఏసీ ఎప్పుడు జరిగింది ఆపరేషను?"

"మొన్న! ఎనిమిదో తేదీన."

"ఏసీ, ఒక్కనిమిషం వుండండి" డాక్టరులేచి అలమారులోని రిజిష్టరు వకటి తెరచి, "అవును 8వ తేదీని ఒకే ఒక ఆపరేషను చేశాం. 4వ నంబరు గదిలో చూడండి." అన్నాడు.

"నేను చూసేను సార్, అక్కడలేడే!"

"ఏమిటి మీ రనేది? అసలు 'పేషంటే' అక్కడ లేడంటూరా?"

"వున్నాడు సార్, కాని మాబావ లేడు"

డాక్టరు వకసారి రామారావును ఎగాదిగా చూచి, మళ్లా రిజిస్టర్ తెరచిచూసి, "మీ బావపేరు ఏమిటన్నారు? వి. రంగారావు. అదేకదూ?"

"కాదండి. నారాయణరావు స్వస్థలం బందరు."

"అయితే యీయన యింకొకరు. వీరిది గుడివాడ."

రిజిష్టరును మూసేసి, కండ్లజోడును తుడుచుకుంటూ బల్లవద్దకు వచ్చి నిలబడ్డాడు డాక్టరు రామారావు లేచి నిలబడి, "అయితే 8వ తేదీన గాని, ఆ పైనగాని నారాయణరావు అనే వ్యక్తికి మీ హాస్పిటల్లో ఆపరేషను జరగలేదన్న మాట" అన్నాడు.

"లేదు. ఇదే మొదటిసారికూడా నేనా పేరు వినడము."

"క్షమించండి శ్రమ యిచ్చేను."

రామారావు గదిదాటి, మందుసీసాల వాసనలోనుంచి యివతల పడ్డాడు, చల్లటి గాలిలో ఎక్కడికోపోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయ్యింది. వాయు పారవశ్యం తీరకముందే, "మరి యిప్పుడేం చెయ్యాలి" అనే ప్రశ్న వుదయించింది ఏం చెయ్యాలి? ఎవరు మాత్రం యీ పరిస్థితిలో ఏంచేస్తారు? తిన్నగా చిన్న బజారులోని యింటికి వెళ్ళిపోవడమే వుత్తమం అని నిశ్చయించుకున్నాడు రామారావు.

ఇంటికి బయలుదేరబోతూండగా రామారావుకు మరో ఆలోచన కలిగింది మరోసారి నాలుగవనంబరు గదిని చూచి, అక్కడున్న రోగి తనబావ కాడని నిర్ధారణచేసుకుంటే వచ్చిన నష్టమేమిటి? అవును. అట్లాగే చెయ్యాలి అనుకుంటూ రామారావు, రోగుల వార్డువైపు తిరిగేడు మళ్ళీ.

గుమ్మములో ఎవరో వృద్ధవితంతువు కూర్చునివుండటం గమనించి, రామారావు నాలుగో నంబరు గదిముందే ఆగిపోయేడు. ఎవరీవిడ? తనతల్లి ఎవరికైనా సాయం తెచ్చుకోలేదుగదా? తనుమాత్రం యీవిడను యిదివరకెన్నడూ చూచివుండలేదు. పక్కకి వెళ్ళడమా ముందుకు నడవడమా అని అతను ఆలోచిస్తూండగా, ఆమె రామారావును చూచి, "ఎవరుకావాలి నాయనా" అని ప్రశ్నించింది, ఎండకు అరచేతిని అడ్డు పెట్టుకుని.

"ఈ గదిలో వుంటేది రంగారావుగారేనా అండి?"

"అవును నాయనా. నీపేరు?" లేచి నిలబడిందామె.

"రామారావండి. మాది బెజవాడ."

పండిత డి.గోపాలాచార్యులవారి
అరుణ
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం,
(ప్రైవేటు) లిమిటెడ్., మద్రాసు-17.

"రా బావా. లోపలకు రా.." హీన స్వరంతో ఎవరో కేకవేసేరు లోపల్నుండి

తనబావేనా? ఈవిడెవరు మరి?

రామారావును తెల్లబోయి చూస్తూ, ఓ ప్రక్కకు తప్పుకున్నది వృద్ధురాలు. రామారావు లోపలకు జొరబడ్డాడు

మంచముమీద పడుకుని వున్నాడు గూడకట్టుతో—రోగి!

గోడవైపు ముఖంపెటుకుని పరున్న అతను, అట్లాగేవుండి, చెయ్యి వూపేడు కుర్చీలో కూర్చోమన్నట్లు, సంజ్ఞతో రామారావు స్తబ్ధుడయి నిలబడిపోయేడు అట్లాగే రోగి నీరసంగా మూలుగుతూ, ప్రక్కకు తిరిగి, తలెత్తి రామారావును చూచి, విస్తుపోయి తలదించేసేడు—నిట్టూరుస్తూ

రోగికి అవతలప్రక్క కూర్చుని విసురుతూన్న యువతి, నిల్చుని, చేతిలోని విసనకర్రతో బొమ్మవలె నిలబడిపోయింది.

రోగి కండ్లుమూసుకుని, చెయ్యివూపుతూ "కూర్చోండి" అన్నాడు హీనస్వరంతో.

ఎంత పొరబడ్డాడు తను! తన బావకాడితను

కుర్చీలో కూర్చుని రామారావు గొణిగేడు "ఏదో పొరబాటుజర్గింది . మా బావ అనుకున్నా"

రోగి కండ్లుతెరచి, మలినహాసంలో అడిగేడు, "నీళ్ళేమయినా తాగుతారా?" రామారావు తలవూపేడు వృద్ధురాలు ప్రక్కగదిలోనుండి మంచినీళ్ళు తెచ్చిచ్చి, "వాడి బావకోసం చూస్తున్నాం నాయనా. అలికిడయితేచాలు బావవస్తున్నాడనుకుంటాడు వాడు" అన్నది

రామారావు నవ్వి, ఖాళీగ్లాసును క్రిందపెట్టేసేడు చిన్న మూలుగుతో రోగి మళ్ళీ కళ్ళుతెరచి, "క్షమించండి మా బావ అనుకున్నాను" అన్నాడు

"నేనూ మా బావను వెతుక్కుంటూ తిరుగుతున్నాను గోపాలంగారి హాస్పటలు యిదేనా, మరేదైనా వుందా?" అన్నాడు రామారావు

"యిదే నాయనా ఇదే" అన్నది వృద్ధురాలు. రోగి ఏదో బాధతో, దీనంగా తన వంకే చూస్తున్నాడు అతనిభార్య కౌసల్య-మహా ఓర్పులో విసురుతూనే వుంది

ఒక్క క్షణము నిశ్శబ్దము అలముకున్నది బాధాకరమైన నిశ్శబ్దములో, రోగి వుండుండి వున్నగా మూలగసాగేడు. రామారావు మూలుగును వినజాలనట్లు గట్టిగా అన్నాడు, మళ్ళీ "మా బావకు యీ హాస్పటలులోనే ఆపరేషను జరిగిందట హాస్పటలు అంతా వెదికేను ఎక్కడా కన్పించలేదు ఉత్తరంలో మాత్రము యీ హాస్పటలు అనే వ్రాసేరు" రామారావుచెయ్యి లాగుజేబూలోని ఉత్తరాన్ని స్పృశిస్తోనేవుంది ... ఉత్తరాన్ని చూపాలా వద్దా అని అతను మనస్సు ఆలోచిస్తూండగా

"అయ్యో ..పాపం"అన్నది వృద్ధురాలు.

"మీ బావ పేరు?" అడిగేడు రోగి.

"నారాయణరావు! బందరు" చెప్పేడు రామారావు

"ఆ మొదటిగదిలో ఆయన — ఏమిటే అమ్మా ఆయన పేరు?" అన్నది వృద్ధురాలు కోడలితో.

"నారా . రాజన్నగారు ... వారిది బందరు ఎందుకయ్యింది. నూజివీడు."

"బావ రాత్రిబండికే వస్తాడు ఉత్తరం చూచుకొని" అన్నాడు రోగి పైకప్పులోకి చూస్తూ.

"ఆ...మీ బావ రావల్సిందే...వెతక బుద్ధులు-అవి పుడకలతోటేగాని పోవు..." అన్నది వృద్ధురాలు.

"లేదమ్మా ... చూస్తూండు. రాత్రి వచ్చేస్తాడు" బాధగా అన్నాడు రోగి.

రామారావుకు ఏంచెయ్యాలో తోచక లేద్దామని అనుకుంటూండగా ముసలావె అన్నది..."నీ పేరేమిటన్నావు బాబూ."

"రామారావండి."

రోగి నెమ్మదిగా చెప్పేడు. "మా బావ పేరూ రామారావే! సుందరరామారావు! అందుకే మిమ్మల్ని లోపలికి రమ్మన్నానిందాక."

రామారావు మనస్సు రెపరెపలాడింది. ఆత్రుతను అగుపించనీయకుండా అడిగేడు.



# ★ వెన్నెలలో మానవుడు ★

"ఏంపని చేస్తాడు మీ బాబు?"

"డి. ఇ. ఓ.-ఆఫీసులో గుమాస్తా"

"ఏవూరు?" తను రోగిని బాధపెడ్తున్నాడు కాని తప్పదు

"బెజవాడ" నిదానంగా తనవైపే చూస్తూ మూలిగేడు రోగి బాధగా

రామారావుకుసగం భారంతగ్గినట్లయ్యింది. ఎంత పొరబాటుచేసేడు పోస్టు ప్యూన్! చిన్న నిట్టూర్పులో తన జేబులోని కార్డును బయటకులాగి, "యీ వుత్తరం మీరు వ్రాసినదేకదూ?" అడిగేడు

రంగారావు వుత్తరం వంక చూచి మూలిగి. .

"మా అవిడే రాసింది అనుకున్నంతా అయ్యిందన్నమాట" అన్నాడు

"ఏం ఏమయ్యింది?" అన్నది వృద్ధురాలు జరిగినదేమిటో అర్థంకాక

"అంత ఆతుఱంగా రాసింది, అది ఎడ్రెస్సు! పాడి ఆతురాలు రాసింది" అన్నాడు రంగారావు.

"అంతేకాదు. డి ఇ ఆఫీసు అన్నది డి. ఇ. ఓ. ఆఫీసు అనేసింది!"

"నేను డిస్ట్రిక్ట్ ఇంజనీర్సు ఆఫీసులో పనిచేస్తున్నాను"

రంగారావు వుత్తరాన్ని వెనకా ముందూ చూచి, నిట్టూర్చి, భార్యవైపు వడవేసి "క్రింద చంతకంఅయినా చేసుకోరూ?" అన్నాడు

"మనస్సు బాగుండక మరచిపోయినట్లున్నా" అన్నది ఆమె ముఖం చిన్నబుచ్చుకొని.

వృద్ధురాలు విషయమంతా యిప్పుడు గ్రహించినట్లు, "అయితే నువ్వు నిన్న రాసిన జాబు మీ అన్నకు చేరలేదన్నమాట"

"ఎట్లా అందుతుంది? పాపం మధ్య యీయన వడిలిపోయి పరుగెత్తుకొచ్చేరు" అన్నాడు రోగి విచారంగా.

"అయ్యొ! బాయినా ఎంత బంగారు పడ్డారో ఏమిటో...అతడులేన్నాక ఎవరైనా వకటేకదా" అన్నది విస్తుపోయి

"బావ రాడన్నమాట" గొణుగుతున్నాడు రోగి. రామారావుకు రోగిమీద జాలివేసింది. కుగదిక్కు లేకుండా, వక్కనెవరూ యీ ఆడవాళ్లతో ఎంత అవస్థ పడుతున్నాడు!

వృద్ధురాలు తుణంక్రింద అన్నమాటలు మళ్ళీ గుర్తుకొచ్చినాయి అతనికి, "అతడ అన్నాక ఎవరికైనా వకటేగదా" రామారావు చేతి గడియారం చూచుకొని "అయిదు కావొస్తోంది" అన్నాడు, టపా వుంటుందో వుండదో అనే వుద్దేశంతో.

రోగి నొచ్చుకుంటూ "మిమ్మల్ని శ్రమ పెట్టే" అన్నాడు

అబ్బే. మరేం భర్వాలేదు... యిక్కడకు రావడంవలన మా బావగారిలా సాగా వుండటంకూడా నిశ్చయంగా తెల్సింది, చూడండి" అన్నాడు.

"మళ్ళీ శ్రమ ఇస్తున్నాను అనుకోకుండా వుంటే మీరట్లా స్టేషనుకు వెళ్ళేప్పుడు . మా బావకో వుత్తరం వ్రాసి పడెయ్యండి."

"ఈ తరహా, మానవమాను! వాళ్ళింటికు వస్తారా ఫోరికే దబ్బువుండగ" తల్లి అన్నది రుసరుస లాడుతూ.

రోగి భార్యముఖం చిన్నబుచ్చుకోడం గమనించేడతను

"నాకు తెపల్లా తెలుస్తుంది మీ కొంచెం నయంగా వున్నాకే వడతా వుత్తరమో, టెలిగ్రామో కాస్సె వుండి పంపిస్తానండి!" రోగి నుదురును స్పృశిస్తూ నుదుటు కాలుతోన్నట్టు వేడిగావుంది

"నాకు సంపాదిగానే వుంది మీరు నాకోసం శ్రమ—"

"అబ్బే మరేంలేదు నేను పోస్టాఫీసుకు వెళ్తాస్తా"

రామారావు రిక్షా ఎక్కి తిన్నగా పోస్టు ఆఫీసు కెళ్ళేడు. అనుకున్నట్లే పోస్టాఫీసు కట్టేసివుంది సుందర రామారావుకి 'బ్రదర్-ఇన్-లా-సిక్-స్టార్ట్' అని టెలిగ్రాం కొట్టి మళ్ళీ రిక్షా ఎక్కేడు దారిలో భోజనంచేసి నాలుగు బత్తాయిపళ్లు కొనుక్కుని అతను తిరిగి హాస్పటలు చేరేసరికి ఎనిమిదయ్యింది.

గుమ్మంలో కూర్చుని నిరురుకుంటూన్న వృద్ధురాలు రామారావును, చేతిలోని బత్తాయిలను చూచి "యిదంతా ఏమిటి నాయనా" అంది నొచ్చుకుంటూ.

"ఫర్వాలే. ఉంచండి" అని గుమ్మంలో వుంచేడు వృద్ధురాలు అరుబయట వేసిన మంచంమీద రామారావు కూర్చొని "ఎట్లా వుందాతనికి" అన్నాడు

వృద్ధురాలు ఆప్రక్కనే చాపొకటి వేసుకొని కూర్చొని "ఇప్పుడే నిద్రపట్టింది నాయనా. ఒళ్లుమాత్రం అలాగే వేడిగా


శుద్ధమైన సువాసనగల మంచి కాఫీ
మీరు సులభంగా కొనగల ధరకు!




స్టేన్స్ ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీ కోరినదుచి బలమేగాక మీకు ఎన్నోకప్పుల కాఫీయగును. ప్రతి ప్యాకేటిపై స్టేన్స్ పేరుచూచి మరీ కొనండి పాటకవి నాణ్యతకు అదే మీ గ్యారంటీ స్టేన్స్ ఎఱ్ఱలేబిల్ ప్యూర్ కాఫీ తాజాగా గాలిచొరనట్లు ప్యాక్‌చేయబడి ½ 1, 3 7, 14&20పౌన్ల టిన్నులలో లభించును

ప్రతియొక్కరు కొనదగు చక్కని కాఫీ!

ది యునైటెడ్ కాఫీ సప్లై కంపెని లిమిటెడ
కోయంబుత్తూరు, దక్షిణ ఇండియా

కాకినాడ ఏజెంటు — శ్రీ కరణం హనుమంతరావు, 'ఈశ్వర నివాస్' తిరుమలరావు, వీధి, కాకినాడ.
విజయవాడ ఏజెంటు — శ్రీ ఎస్. సి హెచ్. మల్లప్పరాజు మాన్యుఫాక్చరర్సు ప్రతినిధి, బకింగ్‌హాంపేట పోస్టు, విజయవాడ.

వుంది. నిన్న మధ్యాహ్నం చేసిన గాభరాకి యివ్వేళ కనక నీ ధైర్యం లేకపోతే ఏమయిపోయేవాళ్ళమో! నువ్వు వెళ్ళేక డాక్టరొచ్చి చూసేడు ఇవ్వేళ గడిస్తే మరేం భయం లేదన్నాడు నువ్విక్కడ వుండటం మాకు కొండంత ఆసరాగా వుంది!"

"మరేం ఫర్వాలేదు అదే తగ్గిపోతుంది బాదేముంది కాస్త మాటసాయం అంతే" అన్నాడు.

అట్లా అనకు బాబూ! ఇంతమంది బంధువులుండి ఏం ప్రయోజనం సమయానికి ఆదుకోలేకపోయేక వాళ్లబావ వున్నాడే— వాడంతా అదోరకం మనిషిలే! ఉత్తరం అందినాగాని అతను వస్తాడని నాకుమాత్రం నమ్మకం లేదునీ్మ మనస్సులో వుండాలిగాని పైనుంచి యెక్కడనుంచి వస్తుంది నాయనా ఆప్యాయతా, ప్రేమా!"

రామారావు తలవూపి వూరుకున్నాడు.

"పెళ్ళికట్నంతాలూకు వో వెయ్యియివ్వాల్సి వున్నారు వాళ్ళింకా పెళ్ళినాడే గోట్లాడగొట్టి పుచ్చుకోలేకపోయేం వెర్రిబాగులవాళ్లం కనక! ఆపరేషనుకు అవసరంకదా అని వో రెండు వందలయినా పంపమని ఆ మధ్య రాయించేను అదీ కోపం వాళ్లకి!"

రామారావుకు ఏమనాలో తోచక "వూహూ!" అన్నాడు

"ఒక్కటిచెపుతాను విను నాయనా! మనుష్యుల్లో స్వార్థం హెచ్చిపోయింది ఇరుగుపొరుగు, మంచీచెడ్డా, న్యాయాన్యాయాలు నశించిపోయేయి అందుకే యీ యుద్ధాలు, కరువులూ, కొటకొలూను దాన్ని తగలెయ్యా డబ్బు పంపించకపోతే పోనీ కాస్త వచ్చి చూసిపోకూడదూ? ఆపరేషను చేయించుకుంటాడని తెలిసికూడా "

"అయితే ఆపరేషనుకు ముందుగా రానేరన్నమాట!"

"రానేడు. వాడేరానేడు గుడివాడనుంచి ఇప్పుడు నువ్వు మాకు ఏమంత బంధువని యిట్లా గిలగిలలాడిపోతున్నావు మనుషులమై పుట్టేక అంతా వకటే! నాకొచ్చిన కష్టమే, నీకొచ్చిన కష్టంలాంటిది కాస్సేపు అట్లా నడుంవాల్చు నాయనా వంటిల్లు చూచుకువస్తా అదొక్కర్తే వుంది పాపం "

రామారావుకు ఎప్పుడు పట్టిందో నిద్ర పట్టింది. ఆకస్మికంగా ఏవో కేకలు విని వులిక్కిపడి లేచేడతను కిటికీలోనుండి లైటు పెద్దదిగా వెలుగుతూండటం గమనించేడు రామారావు రోగికాబోలు అరుస్తున్నాడు బిగ్గరగా! "ఒస్తాడమ్మా వస్తాడంటూంటే! నాకేం ఫర్వాలేదు"

రామారావు లేచి లోపలకు వెళ్లేను మునలామె మంచంమీద కూర్చుని వణికిపోతూన్న రోగిని గట్టిగా పట్టుకునివుంది. కోడలు లాంతరును ఎత్తిపట్టుకుని దీనంగా భర్తను చూస్తూ నిలబడివుంది. రామారావును చూచి వృద్ధురాలు అన్నది, "బాగా జ్వరంతగిలింది వణికిపోతున్నాడు. ముందు గదిలో వుండేమె, నర్సుని ఓసారి పిలుస్తారా?"

రోగి ఏదో వినపడీ వినపడకుండా మాట్లాడేస్తున్నాడు అట్లాగే రామారావుకు వెంటనే అనుమానం వేసింది—'డెలీరియం' ఏమోనని నర్సు ఏం చేస్తుంది?

"డాక్టరు ఎక్కడమ్మా వుండేది!" గడియారం చూచుకుంటూ అడిగేడు రామారావు. 1-10 నిమిషాలు.

"చీకట్లో వెళ్ళగలవా నాయనా? ఆ ఎదురుగా అవుపించే మేడ ప్రక్కనువున్న పచ్చ డాబా".

"ఇప్పుడే వెళ్లి వస్తాను" రామారావు డాక్టర్ యింటికి పరుగెత్తేడు

అర్ధరాత్రి అనుకోకుండా డాక్టరు వచ్చి చూశాడు. ఇంజక్షను యిచ్చి, 'మరేం ఫర్వాలేదు ఉదయానికి పూర్తిగా తగ్గిపోతుంది! అని ధైర్యం చెప్పి వెళ్ళిపోయేసు రోగికి మరో అరగంటకల్లా వళ్లుతెలియని నిద్ర పట్టేసింది

ఉదయాన్నే రోగి రామారావును నవ్వుతూ పలకరించేడు కాఫీ త్రాగేరా అని అడిగేడు. తను చేసే వుద్యోగం గురించి చెప్పేడు. ఆప్తబంధువులా సాయంత్రం వరకు కష్టసుఖాలు అనేకం చెప్పుకున్నారిద్దరూ!

సాయంత్రం డాక్టరువచ్చి రోగినిచూచి, చిర్నవ్వు వదలి వెళ్ళిపోయేడు. నర్సువచ్చి మందిచ్చిపోయింది రోగి బావమాత్రం రాలేదు

ఆరవుతూండగా రామారావు స్టేషనుకు వెళ్ళడానికి లేచేడు.

రోగి అన్నాడు, "వెళ్ళిపోతున్నారా? మీ మేలు "

"అవును. రేపు ఆఫీసు వకటి వుందిగా."

"మీకు మేమెంతో శ్రమయిచ్చేం" వృద్ధురాలు అన్నది

"ఫర్వాలేదు దానికేం "

"గుడివాడవస్తే మాయింట్లో దిగాలి " రోగి భార్య అన్నది.

"అట్లాగే నమ్మా! మరి వస్తా వంట్లో కులాసాచిక్కేక ఓ వుత్తరం వ్రాయించండి ఎడ్రెసు తెలుసుగా—"

అంతా నవ్వేరు ఒక్కసారి! నవ్వుల వెన్నెలమధ్య రామారావు స్టేషనుకు నడిచేడు

* * *

రైలంతా జనంతో కిటకిటలాడిపోతోంది. కిటికీవద్ద కూర్చునివున్న రామారావు కిటికీలోనుంచి బయటకు చూసేడు. ఎటుచూచినా పండువెన్నెల! పెట్టెలోని జనంవైపు చూచేడు. స్థలంకోసం తగువులాడుకుంటూన్నారు నడుస్తూన్న రైల్లోని జనం. బయటకు చూచేడు మళ్ళా! ఆహ్లాదకరమైన వెన్నెల. విచారాలను మరపింపజేసే వెన్నెల! బండీలో తనచుట్టూ చూచేడు మళ్ళీ. పసిపిల్లలకన్నా హీనంగా ప్రవర్తిస్తూన్న ప్రజలు!

విశాల ప్రపంచాన్ని ఆవరిస్తున్న వెన్నెలవంకే చూస్తూన్న అతని మనస్సు ఎంతో ప్రేమతోను, ఆనందంతోనూ నిండిపోయింది. ఎన్నడూ ఎరుగని తృప్తి అతని హృదయాన్ని ఆవరించుకుంది. ఇంతకుముందు యీ ప్రజల్ని చూచి అసహ్యించుకున్నది తనేనా అని ఆశ్చర్యపడసాగేడు రామారావు.

★


## అతిమూత్రవ్యాధి నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్రవ్యాధి (DIABETES) అంటారు ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీనిపాలబడినవారు అరోజుకారోజుమృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి వీనస్ చారమ్ అనేక వంవత్సరములు పరిశోధనల ఫలితంగా తయారుకాబడినది దీన్ని వాడటంవల్ల వేనకు వేలమందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజునుండేమూత్రంలోచక్కెర తగ్గించి అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు ఇన్‌జెక్షన్లు అవసరం లేదు వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి ఉచితంగా పంపెదము

60 బిళ్లల బుడ్డి ఖరీదు రూ. 6-12-0 లు
ప్యాకింగు పోస్టేజి ఉచితము

Venus Research Laboratory (A,P W)
P O Box No 587 Calcutta